జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 27-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 604 పేజీలు: 4 వెల: రూ.7



## మర్డర్

* పొన్నాడ వంతెన వద్ద హత్యకు గురైన మోహనరావు
* వాంబే కాలనీకి చెందిన వ్యక్తి



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 26 (వార్త):** శ్రీకాకుళం నగరం వాంబేకాలనీకి చెందిన పైల మోహనరావు (48) హత్యకు గురయ్యాడు. ఎచ్చెర్ల మండలం పొన్నాడ వంతెన సమీపంలో మోహనరావు మృత దేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మోహనరావు వాంబే కాలనీ రాజీవ్ గృహకల్పలోని 1వ నెంబరు బ్లాక్‌లో నివాసం ఉంటూ టిఫిన్, కిరాణా షాపును నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వడ్డీ వ్యాపారం కూడా చేస్తున్నాడు. గత రెండు రోజులుగా మోహనరావు ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు చాలాచోట్ల వెదికారు. గురువారం సాయంత్రం పొన్నాడ వంతెన సమీపాన అతని మృతదేహాన్ని స్థానికులు కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మోహనరావు తల నుంచి రక్తం కారుతోంది. తలకు తగిలిన బలమైన గాయం కారణంగా మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గూడ్స్ రైలు నుంచి విడిపోయిన ఆరు బోగీలు

* అప్రమత్తమై రైలును నిలిపిన లోకో పైలెట్
* లింకులు సరిచేసిన తర్వాత ముందుకుసాగిన రైలు



**మందస, ఫిబ్రవరి 26 (వార్త):** విశాఖ నుంచి కోల్‌కతా వైపునకు వెళ్తున్న గూడ్స్ రైలు ఆరు బోగీలు శ్రీకాకుళం జిల్లా మందస మండలం మకరజోల వద్ద విడిపోయాయి. మిగిలిన బోగీలతో 100 మీటర్ల దూరం ముందుకెళ్లిన ఇంజిన్‌ను అప్రమత్తమైన లోకోపైలట్ నిలిపివేశారు. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఆ ప్రాంత ప్రజలకు గంటపాటు ఇబ్బందులు పడ్డారు. పలాస రైల్వే స్టేషన్ నుంచి మెకానిక్‌లు వచ్చి బోగీల లింక్‌లు సరి చేశారు. దీంతో గూడ్స్ రైలు ముందుకు కదిలింది.

## అధైర్యపడొద్దు..


* మరో నాలుగు రోజుల్లో సాధారణ స్థితి
* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
* ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి పరామర్శ



# అండగా ఉంటా!







**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26(వార్త):** డయేరియాతో బాధపడుతున్న వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్యపడవద్దని, అండగా ఉండి ఆదుకుంటామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరాన్ని డయేరియా ఇబ్బంది పెడితే.. జిల్లా యంత్రాంగం దాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొని.. తిరిగి నాలుగు రోజుల్లోనే సాధారణ స్థితికి తీసుకువచ్చారని తెలిపారు. గురువారం శ్రీకాకుళం నగరంలో డయేరియా ప్రభావిత ప్రాంతాలైన మంగువారితోట, కంద్ర వీధి, దమ్మల వీధి తదితర ప్రాంతాలలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్‌లతో కలిసి పర్యటించారు. అనంతరం కిమ్స్, జెమ్స్, రిమ్స్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. శ్రీకాకుళం నగరంలో నాలుగు రోజుల క్రితం డయేరియా కేసులు నమోదైన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సత్వరం స్పందించిందన్నారు. క్షేత్ర స్థాయిలో నిరంతర పరిశీలన, సమీక్షలు చేస్తూ.. సాధారణ స్థితికి తీసుకొచ్చారన్నారు. డయేరియా కారణంగా మృతి చెందిన సురేష్ కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ప్రస్తుతానికి జెమ్స్, కిమ్స్, రిమ్స్, జి.జి.హెచ్ ఆసుపత్రులలో 102మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. మంచినీటి సమస్యపై ఇప్పటికే శాంపిల్‌లను కూడా తీసుకుని పరీక్షల కోసం పంపించామని.. ఫుడ్ ద్వారా ఇబ్బంది జరిగిందా అన్న కోణంలో కూడా విశ్లేషణ జరుపుతున్నారన్నారు. నగరంలో మంచినీటి సరఫరాపై కూడా మంత్రి నారాయణ క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి పూర్తి పరిశీలన చేశారని అన్నారు. గతంలో కార్పొరేషన్‌ను సిండికేట్‌గా మారి దగా పరిచారని.. వాటికి స్వస్తి పలుకుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్వచ్ఛాంద్ర పిలుపుతో శానిటేషన్, ఇతర శుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. మంత్రి నారాయణ తెలిపిన మేరకు సుమారు 100 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల ద్వారా కార్పొరేషన్ అభివృద్ధి దిశగా సమూల మార్పులు చేస్తూ అభివృద్ధికి పథకరచన చేశామన్నారు. సుడా ద్వారా మరో 12కోట్ల రూపాయల ద్వారా డ్రెయిన్లను ఆధునీకరిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ కె.అనిత, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎల్.ప్రసన్న కుమార్, రిమ్స్ ప్రిన్సిపాల్ ఎస్.అప్పలనాయుడు, ఆర్ఎంఓ సుభాషిని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## మెళియాపుట్టిలో ఐటీడీఏపై తీర్మానం చేయకుంటే..

* ఎన్నికల హామీలు విస్మరించిన ప్రభుత్వాలు
* ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి
* కలెక్టరేట్ వద్ద ధర్నా

# ఛలో అసెంబ్లీకి పిలుపునిస్తాం




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** జిల్లాల విభజనలో ఐటీడీఏ కోల్పోయిన శ్రీకాకుళం జిల్లాకీ నేటికీ ఐదేళ్లు కావస్తున్నప్పటికీ మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఎందుకు మంజూరు చేయటం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ప్రశ్నించారు. గురువారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆదివాసి జనాభా సుమారుగా రెండు లక్షలు పైబడి ఉన్నారన్నారు. ఆదివాసీల సమస్యలు ఏమైనా ఉంటే సీతంపేట ఐటీడీఏకు వెళ్లి సమస్యలు విన్నవించుకునేవారన్నారు. జిల్లా విభజనలో సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం అయిందన్నారు. దీనివల్ల ఇక్కడ నివసిస్తున్న ఆదివాసి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆదివాసి ప్రజలకు కొంతమేరకు అభివృద్ధి జరిగిందంటే అది గిరిజన అభివృద్ధి సంస్థ సీతంపేట ద్వారానే అని తెలిపారు. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏలు పార్వతీపురం జిల్లా పరిధిలోకి వచ్చాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసులకి అన్యాయం జరగకుండా మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, ఇచ్ఛాపురం నుండి కొత్తూరు వరకు ఉన్న ఆదివాసీలకు పరిపాలన సౌలభ్యం కోసం మెళియపుట్టి కేంద్రంగా ఐటిడిఏ మంజూరుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎన్నికల సందర్భంగా చంద్రబాబును కలిశామన్నారు. శ్రీకాకుళం జిల్లాకు ఐటిడిఏ కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల గడుస్తున్న అతీగతీ లేదన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సైతం మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఏ మంజూరు చేస్తామని ప్రకటన చేశారన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క అడుగు కూడా ముందుకుసాగలేదన్నారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం చేయకుంటే ఛలో అసెంబ్లీకి పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు పాటల తూట ఉదయభాస్కర్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు గురడి అప్పన్న, కోత ధర్మారావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు డప్పు రాజు, వెంకటేష్ సర్పంచ్ భాస్కర్ రావు, సర్పంచ్ సింహాచలం, పాపారావు, మిన్నారావు, మహేష్, కువ్వారి, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ - 2027కు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** అగ్నిపథ్‌లో చేరేందుకు ఆసక్తి గల వివాహం కాని పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విశాఖలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం వారు కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు వారు సేవలందిస్తుందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/ స్టోర్ కీపర్ టెక్నికల్, 10వ తరగతి పాస్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్‌కు 8వ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. ఆన్‌లైన్ సెలెక్షన్ టెస్ట్‌కు www.joinindianarmy.nic.in ఏప్రిల్ 1 వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ నియామక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందన్నారు.

ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్ష ఏపీలోని వివిధ కేంద్రాల్లో జూన్ 1 నుంచి 15 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థి నిర్దేశిత రిక్రూట్‌మెంట్ ర్యాలీ వేదికలో రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వారికి సూచించిన తేదీ, సమయానికి హాజరు కావాలని వారు సూచించారు.

## ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26 (వార్త):** కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉజ్వల 3.0 పథకం ద్వారా నియోజక వర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు సారధ్యంలో కవిటి మండలంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వెంకటరావు అనుమతి మేరకు కేశుపురం గ్రామ పంచాయతీ ఐటీడీపీ మండల అధ్యక్షుడు నరేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుజ్జు భీమరాజు రెడ్డిల ఆధ్వర్యంలో కేశుపురం పంచాయితీలో 20 మంది మహిళలకు అర్హులుగా గుర్తించి ఉచిత గ్యాస్ కనెక్షన్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 20 మంది మహిళలు, యువకులు గణేష్, ఏకాంబర్ పాల్గొన్నారు.

## వైభవంగా సింహా ద్వార ప్రతిష్ఠ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26 (వార్త):** మండపల్లి పంచాయతీలో తిప్పన కురయ్య డిల్లిమ్మ దంపతులు సౌజన్యం తో సింహద్వారం నిర్మాణం జరిగింది. బుడ్డేపు పేట లో చంద్రశేఖరస్వామి ఆలయం సింహద్వారం ప్రతిష్ఠ పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అన్నదానం, కోలాటం, భజన కాలక్షేపం నిర్వహించారు. దక్కత ఢిల్లీరావు, ఎల్.పద్మనాభం, డి.కామేశ్వరరావు, కె.రామారావు, పి.దుర్యోధన, బి.రాజేంద్రప్రసాద్, అనిల్, బాలరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం



**జి.సిగడాం, ఫిబ్రవరి 26(వార్త):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా రాష్ట్రంలో ఎచ్చెర్ల నియోజకవర్గం నెంబరు వన్ నియోజకవర్గంగా తీర్చిందాలని సంకల్పంతో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పనిచేస్తున్నారని మండల టిడిపి అధ్యక్షులు కుమరాపు రవి కుమార్ చెప్పారు. గురువారం స్థానక మండల కేంద్రం బలిజీ కళ్యాణ వేదికలో మీడియా తో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కంపీణీ పెట్టుటవలన పరిశ్రమలు, పెట్టుబడులు, వలన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామాలు, నియోజకర్గం అబివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్ర అబివృద్ధి ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాద్యమన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అద్యక్షులు పైల విష్టుమూర్తి, బాల బొమ్మ వెంకటేశ్వరరావు, బాతువ పీఎసీఎస్ అధ్యక్షుడు నక్క మురళీ, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీ, సీనియర్ నాయకులు టంకాల మౌళీశ్వరరావు, నాయకులు గొల్లాజి,మజ్జి కన్నం నాయుడు కూటమి నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.



## విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

### -సూర్యోదయ స్కూల్ డైరక్టర్ ఎం.నాగేశ్వరరావు

### -ఆ స్కూల్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం

**మందస, ఫిబ్రవరి 26(వార్త):** విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని సూర్యోదయ స్కూల్ డైరక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు అన్నారు. మందస పట్టణంలో గల అగ్ని గంగా వారి సూర్యోదయ స్కూల్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో ప్రతీ ఒక్కరికీ కంప్యూటర్ విద్య తప్పనిసరి అన్నారు. సూర్యోదయ విద్యాలయం డిజిటల్ యుగంలో మరో గొప్ప ముందడుగు వేసిందన్నారు. విద్యార్థుల కలలను సాకారం చేసే దిశగా ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ఒక బలమైన పునాదిగా మారనుందన్నారు. గ్రామ స్థాయిలోనే అత్యాధునిక సదుపాయాలను అందిస్తూ మా సూర్యోదయ స్కూల్ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు పోతుందన్నారు. సాంకేతిక, జ్ఞానం, అభివృద్ధి.. ఈ మూడు లక్ష్యాల్లో మా విద్యార్థులను పోటీ ప్రపంచానికి సిద్ధం చేస్తున్నామన్నారు. మా సూర్యోదయ స్కూల్ లో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం జరగడం మా అందరికీ ఎంతో గర్వకారణమన్నారు. మా పాఠశాలపైన నమ్మకం ఉంచి మీ పిల్లలను చదివిస్తున్న మా సూర్యోదయ తల్లిదండ్రులకు మా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యార్థులు పలు రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని, విద్యార్థులను మంచి భవిష్యత్ గల విద్యార్థులుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 30 వేల సభ్యత్వాలు లక్ష్యం

### -జనసేన నాయకులు కొరికాన రవికుమార్, పిసిని చంద్రమోహన్

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 30 వేల సభ్యత్వాలు లక్ష్యంగా పని చేయాలని జనసేన పార్టీ శ్రేణులకు ఆ పార్టీ జిల్లా నేతలు కొరికాన రవికుమార్, పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురంలో జనసేన ఉద్యమి సభ్యత్య నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి గురువారం వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత వారు స్వేచ్ఛ వతి అమ్మవారికి దర్శనం చేసుకున్నారు. అనంతరం రోటరీ కమ్యూనిటీ హాల్ లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంటిమెంట్‌గా అధ్యక్షుల దగ్గర నుంచి ఇప్పటివరకు ప్రతి కార్యక్రమం ఇచ్ఛాపురంలో ప్రారంభించడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. జిల్లాలో మొదటి స్థానం ఇచ్ఛాపురం నియోజకవర్గం ఉండడం గొప్పతనం అని, ఈసారి 30వేల సభ్యత్వాలూ టార్గెట్ చేయాలని సూచించారు. బీమా గడువు తేదీ ముగిసిన తరువాత సభ్యత్వం తీసుకున్న జనసైనికులు ప్రమాదవశాత్తు మరణించిన వారికి లక్ష రూపాయలు, జనసేన నాయకులు దాసరి రాజు వ్యక్తిగతంగా ఐదువేల రూపాయలు ఇస్తారని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన, బైబిల్ ఈశ్వర్, మత్స్యకార కారదర్శి హరి బెహరా, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి శేఖర్, పెద్దింటి చందు, పీఏసీఎస్ చైర్మన్ పాపారావు, ఏఎంసీ డైరెక్టర్ దుంగ భాస్కర్, కంచిలి మండల అధ్యక్షుడు డొక్కరి ఈశ్వర్, జిల్లా ఐటీ కోఆర్డినేటర్ కాళ్ల దాలయ్య, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు. అనంతరం సుడా నిధులతో నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులను సుడా చైర్మన్ కొరికాన రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు 1, 2, 3 వార్డుల పరిధి ఏఎస్ పేట నుంచి పురుషోత్త పురం వరకు సెంట్రల్ లైటింగ్‌ను పొడిగించాలని ఆయనను కోరారు.



## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ

**జలుమూరు, ఫిబ్రవరి 26 (వార్త):** టెక్కలిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి బి. మాధవరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను స్వయంగా పరిశీలించిన ఆయన, క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టితో పునశ్చరణ చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై, ప్రతి విద్యార్థికి నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. బలహీన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం పాఠశాలఉతల్లిదండ్రులుఉఉపాధ్యాయుల సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్నారు.



## ఎల్లమ్మతల్లి జాతరకు పోటెత్తిన భక్తులు





**మందస, ఫిబ్రవరి 26(వార్త):** గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జామి ఎల్లమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. మందస మండలంలోని గోపాలపురం-శ్రీనివాసపురంలో గల ఎల్లమ్మతల్లి జాతరకు సోంపేట-మందస మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి, ఎల్లమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉండే పుట్టకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీనివాసపురం వెళ్లాలంటే మహేంద్రతనయ ఏరు దాటించి వెళ్లాల్సి ఉంది. కులవృత్తులను నమ్ముకుని వారు వివిధ వృత్తిదారులు యాత్రలో వారు తయారు చేసిన వస్తువులను అమ్ముకున్నారు. వివిధ రకాలైన బొమ్మలు, తినుబండారాల స్టాల్స్ తాత్కాలికంగా వెలిసాయి. జామి జాతర సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు శానాపతి కిశోర్ కుమార్, కొత్తపల్లి సర్పంచ్ సేనాపతి దివ్య, పితాతోలి సర్పంచ్ ప్రతినిధి చింతాడ గణపతి, కరతలపాలెం సర్పంచ్ గున్నయ్య సబ్ రిజిస్ట్రార్ రఘురాంపండా, సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

### - ధర్మాన కృష్ణచైతన్య

### -రామకృష్ణాపురంలో బాధిత కుటుంబాలకు పరామర్శ

**జలుమూరు, ఫిబ్రవరి 26(వార్త):** అందవరం పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నిరుపేదల ఇళ్లు దగ్ధమయ్యాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని వైసీపీ నేత, జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య కోరారు. గురువారం రామకృష్ణాపురం గ్రామాన్ని సందర్శించిన ఆయన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారని వివరించారు. ప్రభుత్వపరంగా తక్షణ సహాయం అందించి నివాస వసతి, అవసరమైన సామగ్రి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమ వంతు సహకారాన్ని కూడా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



## సంకల్పంపై అవగాహన



**నరసన్నపేట, ఫిబ్రవరి 26(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'సంకల్పంఽ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మత్తు పదార్థాలు, సైబర్ నేరాలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తుపై స్పష్టమైన దృష్టితో ముందుకు సాగితే మంచి అవకాశాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎస్సై బి. గణేష్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాక సమాజానికీ హానికరమని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శాంతిహెమ్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కండి



**నరసన్నపేట, ఫిబ్రవరి 26(వార్త):** వచ్చే నెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. గురువారం నరసన్నపేట బోర్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉన్నందున చదువుపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ప్రతిరోజూ పాఠ్యాంశాలను పునశ్చరణ చేయడం, సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవడం అవసరమన్నారు. అలాగే పరీక్షా కేంద్రాలకు తప్పనిసరిగా గంట ముందే చేరుకుని హాల్ టికెట్ వంటి అవసరమైన పత్రాలు వెంట తీసుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు.

## టెన్త్ విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రుల సమీక్ష

**నరసన్నపేట, ఫిబ్రవరి 26(వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను హెచ్ఎం ఒకలా రత్నమాల తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ప్రతిభను మెరుగుపర్చేందుకు ఇంటి వద్ద చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. రాబోయే వార్షిక పరీక్షల దృష్ట్యా సమయపాలన, పునశ్చరణ, నమూనా ప్రశ్నాపత్రాల సాధన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల తరఫున ఉత్తమ ఫలితాల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులుఉఉపాధ్యాయుల సమన్వయం ఎంతో అవసరమని సమావేశంలో పేర్కొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మార్చి 1నే గురుకులాల ప్రవేశ పరీక్ష

**-జిల్లా కో ఆర్డినేటర్ వై. యశోదలక్ష్మి**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2026-2027 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి మార్చి 1న (ఆదివారం) యథావిధిగా నిర్వహిస్తామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటలు వరకు , ఇంటర్ (జనరల్) మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు, ఐఐటీ/నీట్ బ్యాచ్ పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్స్‌ను https://apbragcet.apcfss.in/ వెబ్‌సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. ఇతర వివరాలకు 9701736862, 8331005217 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం పొందాలని ఆమె తెలిపారు.

# వెట్టిచాకిరీ నిర్మూలన సామాజిక బాధ్యత

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం అమలులోకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), నేచర్ ఎన్జీఓ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి, సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న అప్పుకు ప్రతిఫలంగా తక్కువ వేతనం లేదా అసలు వేతనం లేకుండా బలవంతంగా పనిచేయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఈ చట్టం ప్రకారం వెట్టిచాకిరీ కింద ఉన్న పాత అప్పులన్నీ రద్దవుతాయని, బాధితులు ఆ అప్పును తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, వారి ఆస్తులు యజమాని వద్ద తనఖాలో ఉంటే వాటిని విడిపించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వెట్టిచాకిరీ చేయించుకునే యజమానులకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తారని జడ్జి హెచ్చరించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు మాట్లాడుతూ.. 1976 నిర్మూలన చట్టం దేశవ్యాప్తంగా వెట్టిచాకిరీని రద్దు చేసిందని, ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ముఖ్యంగా అసంఘటిత రంగాల్లోని కార్మికులు ఈ దోపిడీకి గురవుతున్నారని, వారిలో చైతన్యం తెచ్చేందుకు ఈ సంచార వాహనం జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, నేచర్ ఎన్జీఓ డైరెక్టర్ ఎస్.వికాస్, ప్రతినిధులు చైతన్య, దుర్గ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన




**నరసన్నపేట, ఫిబ్రవరి 26(వార్త):** రైతులు ప్రతి ఏడాది తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఓ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటి నాయుడు సూచించారు. బుధవారం సాయంత్రం నరసన్నపేట మండలం గోపాలపెంట గ్రామంలో రైతులతో పొలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, మట్టి నమూనాలను సరైన విధంగా ఎలా సేకరించాలో రైతులకు ప్రాయోగికంగా చూపించారు. పరీక్షల అనంతరం లభించే నివేదిక ఆధారంగానే ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించడం ద్వారా పంటల దిగుబడి పెరగడమే కాకుండా, అనవసర ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు అనుసరించి వ్యవసాయం చేస్తే లాభాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఆదిత్యుడికి రూ.లక్ష విరాళం



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారికి గురువారం విశాఖపట్నం వాస్తవ్యుడు కిరణ్ .. ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.1,00,000 చెక్కు ద్వారా ఆలయ జూనియర్ అసిస్టెంట్ బాల భాస్కర్‌సాయికి అందజేశారు. ఆయనను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

## 10 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యం



**నరసన్నపేట, ఫిబ్రవరి 26(వార్త):** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్లు నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి బలగ ప్రవీణ్ తెలిపారు. గతంలో నియోజకవర్గంలో 3,300 సభ్యత్వాలు నమోదు చేసినట్లు పేర్కొన్న ఆయన, ఈసారి అధినేత ఆదేశాల మేరకు మార్చి 10వ తేదీలోగా 10 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామాల వారీగా, బూత్ స్థాయిలో చేపట్టి యువత, మహిళలు, అభిమానులను పార్టీలో చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి సంస్థాగత బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భంలో పార్టీ తరఫున అందించే భీమా సదుపాయాలు వంటి అంశాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## బీసీ సింహగర్జన విజయంతో ప్రభుత్వంలో వణుకు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26 (వార్త):** ఈ నెల 22న మంగళగిరిలో బీసీ సింహగర్జన మహాసభ అపూర్వ విజయంతో వేలాదిగా తరలివచ్చిన బీసీల ఐక్యతను చూసి ఓర్వలేక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగిందని భారతచైతన్య యువజన (బిసివై) పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ కన్వీనర్ బడ్డి మురళి తీవ్రంగా ఆరోపించారు. టీడీపీ ర్యాలీలో జరిగిన ట్రాఫిక్ అంతరాయాలు, డీజే వినియోగం వంటి అంశాలను బీసీవై పార్టీపై మోపుతూ, పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ మీద నమోదు చేసిన కేసును అక్రమ కేసుగా అభివర్ణించారు. టీడీపీ నిర్వహించిన ర్యాలీలో స్పష్టంగా డీజే సౌండ్లు, ట్రాఫిక్ అంతరాయం కనిపించినప్పటికీ, పోలీసులు ఆ తప్పులను బీసీవై పార్టీకి ఆపాదిస్తూ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘన పేరుతో కేసు నమోదు చేయడం పూర్తిగా నిరంకుశ ధోరణి అని మండిపడ్డారు. టీడీపీ చేసిన తప్పులకు బీసీవై పార్టీని బాధ్యుల్ని చేయడం ప్రభుత్వం రాజకీయ ప్రతీకారానికి నిదర్శనమని విమర్శించారు. కేసులకు భయపడము , పోరాటం ఆగదని అన్నారు.సభ విజయాన్ని చూసి ఓర్వలేక అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నారు. కానీ బీసీల హక్కుల కోసం మా పోరాటం ఆగదు. మా ఐదు డిమాండ్ల సాధన కోసం మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని అన్నారు.

## జాడుపూడిలో వైభవంగా ఎల్లమ్మ జాతర

**కంచిలి, ఫిబ్రవరి 26(వార్త):** జాడుపూడి సమీపంలో గురువారం జామి ఎల్లమ్మ జాతర ఎంతో వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వివిధ మండలాల నుంచి వేలాదిమంది భక్తులతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరు కావడంతో ఎల్లమ్మ జాతర విశేషంగా ఆకట్టుకుంది. ఇటు కంచిలి అటు సోంపేట అలాగే కవిటి, ఇచ్ఛాపురం మండలాల నుంచి వేలాదిగా జనం జాతరకు చేరుకున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక వేస్తే రాలనంతగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనేకమంది ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మ వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, సర్పంచ్ పలికల జయరాం, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్త నరేంద్ర యాదవ్, వైసీపీ నాయకులు వజ్జ మృత్యుంజయ, తలగాన తిరుపతి, లడ్డు కేశవపాత్ర, సిహెచ్ దేవరాజు, డొక్కారి బలరాం, మడ్డు అభి, వెంకటేష్ ఎల్లమ్మను దర్శించుకున్నారు.



## చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



**పోలాకి, ఫిబ్రవరి 26 (వార్త):** వనవిష్ణుపురం గ్రామానికి చెందిన మురపాల అచ్చోడు (75) ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం, వనవిష్ణుపురం గ్రామంలో రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న అచ్చోడును వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. తక్షణమే స్థానికులు ఆయనను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## సరస్వతీమాత ఆలయానికి శంకుస్థాపన



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 26(వార్త):** మెళియాపుట్టిలో గల షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణానికి ఆనుకొని సరస్వతీమాత ఆలయ నిర్మాణానికి ఆలయ ధర్మకర్తలు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆలయ ట్రస్టి కాళ్ల ప్రసాద్ తెలిపారు. షిరిడిగిరి ఆలయ ప్రాంగణంలో సరస్వతిమాత ఆలయ నిర్మాణాన్ని షిరిడిగిరి ఆలయ ధర్మకర్తలు కాల రామారావు దంపతులచే నిర్మించనున్నట్లు ఆయన తెలియజేస్తూనే ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. శుక్రవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలతో పాటు షిరిడి సాయి భక్తులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## 28న శ్రీముఖలింగంలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్




**జలుమూరు, ఫిబ్రవరి 26(వార్త):** శ్రీముఖలింగం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. గురువారం ఉదయం విడుదల చేసిన వీడియో సందే శంలో ఈ నెల 28వ తేదీన సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఆయా పాఠశాలల హెచ్ఎంలు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ఈ ఎగ్జిబిషన్ ఉపయుక్తంగా ఉంటుందని తెలి పారు. అన్ని పాఠశాలలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.





# స్వయం ఉపాధితోనే ఆర్థిక పురోగతి




**ఎచ్చెర్ల, ఫిబ్రవరి 26 (వార్త):** నిరుద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని సొంతంగా ఎదిగేందుకు కృషి చేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పెడాడ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం, సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం లబ్ధిదారులకు గురువారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 5 లక్షల లోపు రుణాలు పొందిన వారికి ఐదు రోజులు, అంతకంటే ఎక్కువ రుణం తీసుకున్న వారికి పది రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయ్యాక ఇచ్చే ధృవీకరణ పత్రాలను సంబంధిత బ్యాంకుల్లో సమర్పించాల్సి ఉంటుందని, ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే తదుపరి విడతలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

### మహిళా దినోత్సవం నాటికి యూనిట్ల స్థాపన

మహిళా లబ్ధిదారులందరూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తమ ఉపాధి యూనిట్లను ప్రారంభించి ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ ఆకాంక్షించారు. మార్చి 8వ తేదీ లోపు లబ్ధిదారులందరూ తమ యూనిట్లను గ్రౌండింగ్ చేసి సిద్ధం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రెండో విడతగా ఈ శిక్షణ జరుగుతోందని సంస్థ డైరెక్టర్ రాంజీ తెలపగా, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణ మాట్లాడుతూ.. లబ్ధిదారులు వ్యాపార మెళకువలు నేర్చుకుని అభ్యున్నతి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, శిక్షకులు పాల్గొన్నారు.

## ఏపీజేఏసీ జనరల్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** ఏపీజేఏసీ జనరల్ సెక్రెటరీగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు హనుమంతు సాయిరాం సమక్షంలో బుధవారం రాత్రి జరిగింది. ఆయన ఎన్నికపై రాష్ట్ర అధ్యక్షులు జి హృదయ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ చిరంజీవి, రాష్ట్ర సహాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి చింతాడ దిలీప్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతిరావు, జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, రాష్ట్ర, జిల్లా కౌన్సిలర్లు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఏపీటీఎఫ్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలిపారు. 30 ఏళ్లుగా ఏపీటీఎఫ్‌లో కొనసాగుతూ ఉపాధ్యాయ లోకానికి అనేక సేవలను అందిస్తూ, అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఈ సందర్భముగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తానని తెలిపారు.

## మండల స్థాయి ఉద్యోగులకు స.హ.చట్టంపై అవగాహన ఉండాలి

**- జడ్పీ సీఈఓ సత్యనారాయణ**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** పంచాయతీలను పర్యవేక్షించే డిప్యూటీ ఎంపీడీఓలు సమాచార హక్కు చట్టాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని జడ్పీ సీఈఓ సత్యనారాయణ అన్నారు. జడ్పీ సమావేశం మందిరంలో అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓ, పరిపాలన అధికారులకు గ్రామ పంచాయతీ ల అభివృద్ధి పథకంపై శిక్షణలో భాగంగా స.హ.చట్టంపై అవగాహన సదస్సు గురువారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజలు స.హ.చట్టం దరఖాస్తులు ఎక్కువగా గ్రామ పంచాయతీలకు పంపిస్తున్నారని, చట్టంపై సరైన అవగాహన లేకపోవడం వలన సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగి సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఇటువంటి శిక్షణను ఎంపీడీఓలు తమ మండలాలలో ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాలని సూచించారు. స.హ.చట్టం రిసోర్స్‌పర్సన్ కొమ్మాజోస్యుల వసంతకుమార్ సమా చార హక్కు చట్టం నిబంధనలు, ఎటువంటి సమాచారం ఇవ్వాలి, ఏ సమాచారానికి మినహాయింపులు ఉన్నాయనే వంటి అంశాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి గోపీబాల, జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర అధికారిణి నిశ్చల, డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారులు, వివిధ మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీముఖలింగేశ్వర ఆలయ అభివృద్ధికి సహకరించండి

### కేంద్ర పురావస్తు శాఖను కోరిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**జలుమూరు, ఫిబ్రవరి 26 (వార్త):** విజయవాడలో కేంద్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్‌ను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీముఖలింగేశ్వర దేవాలయ అభివృద్ధి కోసం కేంద్ర పురావస్తు శాఖ ద్వారా అవసరమైన సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సమగ్ర లైటింగ్ ఏర్పాటు, క్యూ లైన్స్ నిర్మాణం, టాయిలెట్స్ ఏర్పాటు, భక్తులకు విశ్రాంతి కోసం గెస్ట్ రూమ్స్ నిర్మాణం వంటి ముఖ్యమైన సదుపాయాలను కల్పించాలన్నారు. దేవాలయం పరిసర ప్రాంత అభివృద్ధి, భక్తులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు కేంద్ర పురావస్తు శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనికి సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## 28న సీఎం చంద్రబాబు విజయనగరం జిల్లా పర్యటన

* రావివలసలో పింఛన్లు పంపిణీ చేయనున్న చంద్రబాబు
* ముఖ్యమంత్రి పర్యటనకు భద్రత ఏర్పాట్ల వేక్షించిన విజయనగరం కలెక్టర్, శ్రీకాకుళం ఎస్పీ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి మండలం రావివలస గ్రామంలో ఈనెల 28న పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను శ్రీకాకుళం ఎస్పీ, విజయనగరం జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ కే.వి.మహేశ్వర రెడ్డి, జిల్లా కలెక్టరు ఎస్.రామ సుందరరెడ్డి, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు గురువారం పరిశీలించారు. హెలిప్యాడ్, ప్రజా వేదిక, పెన్షన్లు పంపిణీ చేసే ఇండ్లను, కార్యకర్తలతో సమావేశం కానున్న ప్రాంగణంను అధికారులు సందర్శించి, నిర్మాణ పనులను, ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో పోలీసు సిబ్బంది, అధికారులు వ్యవహరించాల్సిన తీరు, చేపట్టాల్సిన భద్రత చర్యలపై అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, దిశా నిర్దేశం చేశారు. రోప్ పార్టీలు, రూట్, మూవింగ్ బందోబస్తు, నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. రహదారిపై వాహనాలు నిలపకుండా పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే నిలిపే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రూఫ్ టాప్ లపై విధులు నిర్వహించే భద్రత సిబ్బంది చుట్టూ ఉన్న ప్రాంతాలను బైనాక్యులర్స్ నిశితంగా పరిశీలించాలన్నారు. విధుల్లో ఎటువంటి నిర్లక్షం వద్దని, సమన్వయంతో పని చేయాలని, ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, విధులు నిర్వహించాలన్నారు. భద్రత విధులు నిర్వహించే సిబ్బంది, అధికారులకు తాము నిర్వహించే విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్య వ్యక్తులు, నాయకులు, ప్రజల వాహనాలను పార్కింగు చేసేందుకు ప్రత్యేకంగా పార్కింగు స్థలాలను ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు సేతు మాధవ్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## కార్పోరేషన్ అధికారులు జవాబుదారీగా ఉండాలి

* నీటి పంపిణీ పూర్తిగా ఆధునీకరించండి
* నీటినమూనా పరీక్షలు శ్రీకాకుళంలో జరగాలి
* కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
* ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో డయేరియాపై ప్రత్యేక చర్చ
* అనంతరం కార్పోరేషన్ అధికారులతో సమీక్ష




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26(వార్త) :** శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన డయేరియ వ్యాధి ఉధృతిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం ఉదయం ఢిల్లీ నుండి శ్రీకాకుళం నగరం చేరుకున్న రామ్మోహన్ నాయుడు.. నగరంలో ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి క్షేత్ర స్థాయి ఇబ్బందులను తెలుసుకున్నారు. రోగులను, మృతుల కుటుంబాలను పరామర్శించి భరోసా ఇచ్చారు. ఇక ఫైనల్ టచ్ గా గురువారం సాయంత్రం జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షలో కీలక అంశాలు చర్చకు తీసుకువచ్చి.. అన్నింటిని పూర్తి చెయ్యడానికి డెడ్ లైన్ విధించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌కు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి చేరుకున్న రామ్మోహన్ నాయుడు తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. నగరంలో డయేరియా సాధారణ స్థితికి వచ్చిందని, అందుతున్న వైద్య సదుపాయాల వివరాలను సైతం ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం జిల్లా అధికారులు, కార్పోరేషన్ అధికారులతో రామ్మోహన్ నాయుడు ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డయేరియా కారణాల అన్వేషణతో పాటు.. భవిష్యత్ లో ఎప్పుడు కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రీసెట్ బటన్ ఆన్ చేశారు. తొలుతగా కారణాల అన్వేషణ వేగవంతం చెయ్యాలని సూచిస్తూనే.. ఇకపై నీటి నమూనాల పరీక్షకు విశాఖపట్నం వరకు వెళ్ళకుండా.. సంబంధిత కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ ను ఆదేశించారు. అంతేకాకుండా నీరు కలుషితమైందా, లేదా అనే అంశం ప్రాథమికంగా నిర్ధారించుకునేలా క్షేత్ర స్థాయిలో, ప్రతీ వార్డులో ఏర్పాటు ఉండాలని స్పష్టం చేశారు. నీటి సాంపిల్ పరీక్షల వివరాలను.. రోజువారి నివేదికలు, వారపు నివేదికలు, నెలవారీ నివేదికల రూపంలో పొందుపరిచి ఎప్పటికప్పుడు సంబంధిత వెబ్ సైట్‌లో అప్లోడ్ చెయ్యాలని.. జిల్లా స్థాయి అధికారులు వాటిని నిశితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ శాఖ నుండి విడుదల కాబోతున్న నిధులు, సుడా నుండి మంజూరైన రెండు కోట్ల తో డ్రెయిన్లు, పారిశుధ్యం పక్కగా ఉండాలని తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని 50 వార్డులలో శానిటేషన్ విధిగా జరిగేలా, ఇబ్బందులు ఉన్న చోట త్వరితగతిన పరిష్కారం అయ్యేలా ఉండలాని స్పష్టం చేశారు. నగరంలో నీటి పంపిణి వ్యవస్థలో స్టార్టింగ్ పాయింట్ నుండి తుది వరకు ఉన్న వ్యవస్థ మొత్తం ఆధునీకరించాలని తెలిపారు. నీటి పంపిణీలో చివరి కుళాయి వరకు ఒకేరకమైన వేగంతో నీటి సరఫరా జరగాలని, మలినాలు అందులో కలువకుండా పటిష్టమైన వ్యవస్థ ఉండాలని అన్నారు. నీటి పీడనం నిలకడగా ఉండేలా వాల్వ్ వ్యవస్థను మళ్ళీ స్థిరీకరించాలని అన్నారు. ఈ మొత్తం వ్యవస్థలో అందుబాటులో ఉన్న ట్యాప్స్, ఉన్న ఉద్యోగుల వివరాలు, ఇంకా అవసరమైన వారి వివరాలు, ప్రాజెక్టు పూర్తికి అవసరమయ్యే సమయంతో ఒక సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. నీటి పంపిణి, విద్యుత్, సానిటేషన్, డ్రెయిన్ల విషయంలో ప్రజలకు నగరపాలక సంస్థ అధికారులు పూర్తి జవాబుదారిగా ఉండాలని స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పలు కీలక సూచనలు చేశారు. ఉద్యోగుల బదిలీలు హెచ్.ఓ.డి స్థాయిలో జరుగుతూ ఉండటం స్థానికంగా.. అందే సేవలకు ఇబ్బందిగా మారిందని.. దానిపై దృష్టి సారించాలని కలెక్టర్ కోరారు. కీలకంగా ఉండాల్సిన కార్పోరేషన్ అధికారులు దీర్ఘకాలిక సెలవుల్లో ఉండటం, కాంట్రాక్టర్లు రోడ్ల నిర్మాణంకు ముందుకు వస్తూ డ్రెయిన్ల నిర్మాణంలో అశ్రద్ధ వహిస్తున్నారని. రెండింటికి ముడిపెట్టి టెండర్లు నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. తాజా సమీక్షలో చర్చకు వచ్చిన ప్రతీ అంశం మినిట్స్ లో రికార్డు చెయ్యాలని, వచ్చే సమీక్షలో ప్రతీ ప్రశ్నకు జవాబు ఉండాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్, విజయవాడ నుండి వచ్చిన పబ్లిక్ హెల్త్ ప్రత్యేక అధికారి ప్రభాకర్, డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత, కార్పోరేషన్ అధికారులు, రెవెన్యు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా కట్టడికి కఠిన చర్యలు

* అతిసారం అదుపులోకి వచ్చే వరకూ ఫాస్ట్‌ఫుడ్ విక్రయాలు ఆపండి
* పశువులను రోడ్డుపైకి వదిలితే యజమానులపై కఠిన చర్యలు
* ప్రజలు అధికారులకు సహకరించాలి
* వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించండి
* వాంతులు, విరేచనాలు, జ్వర లక్షణాలు ఉంటే 08942-228090 సమాచారమివ్వండి
* జాయింట్ కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 26(వార్త):** నగర పాలక సంస్థ పరిధిలో అతిసార వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని జాయింట్ కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న దమ్మల వీధి, కాకి వీధి, మంగువారి తోట, మేదర వీధి, గుడి వీధి ప్రాంతాల్లో పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు ఫాస్ట్ ఫుడ్, మాంసం దుకాణాల వంటి ఆహార వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. ఈ నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు కొనసాగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నగర వీధుల్లో పశువుల సంచారం వల్ల అపరిశుభ్రత పెరిగి వ్యాధి వ్యాప్తికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అందుకే పశువుల యజమానులు తమ ఆవులను, ఇతర మూగజీవాలను రోడ్లపైకి వదలకుండా ఇళ్లలోనే ఉంచాలని స్పష్టం చేశారు. ఈ ఆంక్షలను ధిక్కరించే పశువుల యజమానులపై చట్టప్రకారం జరిమానాలు విధించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మునిసిపల్ కార్పొరేషన్ వైద్య బృందాలు, సచివాలయ సిబ్బంది ప్రభావిత ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, ప్రజలు అధికారులకు సహకరించి వ్యాధి నిర్మూలనకు తోడ్పడాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మరిగించి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని జేసీ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను, వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలని అభ్యర్థించారు. విరేచనాలు, వాంతులు లేదా జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని లేదా కార్పొరేషన్ హెల్ప్ లైన్ నంబర్ 08942-228090 కు కాల్ చేయాలని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండటం వల్లే పరిస్థితిని వేగంగా అదుపులోకి తీసుకురాగలుగుతున్నామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

## ఘనంగా కాశీబుగ్గ ఎల్లమ్మ తల్లి జాతర

**పలాస, ఫిబ్రవరి 26(వార్త):** కాశీబుగ్గలో జరుగుతున్న ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా, వైభవంగా కొనసాగుతోంది. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కెవి రమణ పర్యవేక్షణలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల దర్శనం, క్యూ లైన్ల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, అవాంఛనీయ సంఘటనల నివారణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బందోబస్తులోసీఐలు,ఎస్సైలు,సివిల్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ, రోప్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు. అదనంగా డ్రోన్ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాశీబుగ్గ-పలాస జంట పట్టణాలు, పరిసర ప్రాంతాలతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో క్యూ లైన్ల ద్వారా సౌకర్యవంతమైన దర్శన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలలో భాగంగా త్రీ రోడ్డు జంక్షన్ నుండి పలాస వైపు వెళ్లే, పలాస వైపు నుండి కాశీబుగ్గకు వచ్చే వాహనాలను కోసంగిపురం, బెండి గేట్ వైపు మళ్లించారు. జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను పలాస జూనియర్ కాలేజీ గ్రౌండ్ లేదా రైల్వే గ్రౌండ్‌లో పార్క్ చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546